సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



ఆశ పడితే అంతే సంగతులు

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ప్రాణాలు తీస్తున్నాయి. అవగాహన తప్పనిసరి.

- 8లో



తెలుగు తమ్ముళ్ల పిక్కాట

నరసన్నపేటలో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. పిక్కాట ఆడుతూ స్థానికులకు దొరికారు.

- 8లో



ఆత్మీయ ఆలింగనం



శ్రీకాకుళం జామియా మసీదులో ప్రార్థనలు

ఈద్ ముబారక్



సందేశం వినిపిస్తున్న మతపెద్ద

ఆత్మీయ ఆలింగనాలు, ప్రత్యేక ప్రార్థనలు, ఇఫ్తార్ విందులతో రంజాన్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మసీదుల వద్ద ఈదుల్ ఫితర్ నమాజులు జరిగాయి. ప్రజలు శాంతి సౌభాగ్యాలతో ఉండాలని, ప్రవక్త మాటలు ఆచరణీయం కావాలని మత పెద్దలు ఆకాంక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

న్యూస్‌రీల్

రెవెన్యూ ఉద్యోగి బరితెగింపు



మజ్జిలిపేటలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగి (వృత్తంలో)

పొందూరు: మండలంలోని మజ్జిలిపేట గ్రామానికి చెందిన జి.జనకచక్రవర్తి సీనియర్ అసిస్టెంట్‌గా పొందూరులో పని చేస్తున్నారు. మజ్జిలిపేటలో రెండు రోజుల కిందట నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొనడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. కానీ ఆయన ఎలాంటి భయం లేకుండా టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సందడిగా శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణతో ఊరేగుతున్న దాసుడు, ఘంటోమోనరి

వజ్రపుకొత్తూరు రూరల్: జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో సందడిగా శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 12 రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం తక్కురాణి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దాసుడు మువ్వల డొమ్మ, ఘంటో మోనరి మువ్వల పురుషోత్తంలు ప్రత్యేక అలంకరణతో, సాంస్కృతిక కార్యక్రమాలతో జన సంద్రం నడుమ ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు చేసి ముడ్రాటలు, కానుకలు సమర్పించారు. కాగా సుమారు 10 వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఉత్సవ వేడుకలలో మొదటి తంతును భక్తిశ్రద్ధలతో జరిపారు. దీంతో గ్రామ ప్రధాన వీధి జనంతో కిక్కిరిసింది. అలాగే యువతీ యువకులు నృత్యాలతో సందడి చేశారు.

ఉచిత నాట్య శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న స్వాతీ సోమనాథ్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీ సత్యసాయి బృందావనంలో ఉగాది సందర్భంగా ఉచిత నాట్య శిక్షణ ప్రారంభమైంది. సంప్రదాయం కూచిపూడి గురుకులం డైరెక్టర్ స్వాతీ సోమనాథ్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంజలి, యామిని, లోకేశ్వరి, సాయి మందిరం భక్తులు పాల్గొన్నారు.

ఆగని దందా

ఉల్లంఘనుల చేతుల్లో గనులు అస్తవ్యస్తంగా మారిపోయాయి. తమ వారు తప్ప మరెవ్వరూ వ్యాపారం చేయకూడదనే రీతిలో అధికార పక్షం వ్యవహరిస్తుండడంతో.. మైనింగ్ వ్యాపారం మీనింగే మారిపోతోంది. ఓ ముఖ్యనేత సోదరుడి ఆజ్ఞల ప్రకారమే అధికారులు నడుచుకోవడంతో నిబంధనలు కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వానికి ఆదాయం పోయినా ఫర్వాలేదు.. తమ ఆదాయం మాత్రం బాగుండాలనే కూటమి పెద్దల తీరుతో మైనింగ్ రంగం కుదేలవుతోంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో గనుల తవ్వకాలు స్తంభించిపోయాయి. తమకు కప్పం కట్టిన వారికి మాత్రమే మైనింగ్ చేసుకునే అవకాశం ఇస్తున్నారు. కప్పం కట్టని గనుల యజమానులపై ఆంక్షలు, కక్ష సాధింపులతో ఇబ్బందులు పెడుతున్నారు. మరోవైపు కూటమి నేతలు ఎక్కడికక్కడ గనులను స్వాధీనం చేసుకుంటూ అక్రమంగా తవ్వకాలు సాగిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ముఖ్య నేతల నేతృత్వంలో ఇదంతా జరుగుతుండటం విశేషం. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల పాటు కార్యకలాపాలను నిలిపివేశారు.

వాటాలిచ్చేందుకు ఒప్పందాలు కుదిరాక గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన వారికి ఆంక్షలు, అభ్యంతరాల్లేకుండా అవకాశం కల్పించారు. ఇతరులకు మాత్రం సవాలక్ష ఆంక్షలు, కండీషన్లు పెడుతున్నారు. కానీ, క్రషర్ల విషయంలో కక్ష సాధింపులు ఆపలేదు. అధికార పార్టీకి చెందిన వారి క్రషర్లకే ఆమోదం తెలిపారు. అధికార పార్టీకు చెందిన కార్యకర్తల క్రషర్లకు మైనింగ్ ప్లాన్ ప్రకారం ఉండాల్సిన అనుమతులు లేకపోయినప్పటికీ ఆయా క్రషర్లపై అధికారులు కనీసం చర్యలు తీసుకోలేదు. అధికార పార్టీయేతరులకు చెందిన క్రషర్లను మాత్రం తెరిచేందుకు అవకాశం ఇవ్వలేదు. రకరకాల ఆంక్షలు, కారణాలతో ఒక్క టెక్కలి నియోజకవర్గంలో పదుల సంఖ్యలో క్రషర్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. సంబంధిత యాజమాన్యాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. వాటిపై ఆధారపడిన కార్మికులు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రభుత్వానికి కూడా ఆదాయం రాకుండా పోతోంది.

అధికార పార్టీ వారికి మినహాయింపు

అధికారికంగా మైనింగ్ కార్యకలాపాలకు మరోసారి బ్రేక్ పడింది. టెక్కలి మైనింగ్ కార్యాలయం పరిధిలో ప్రస్తుతం ఏజెన్సీ వ్యవస్థగా వ్యవహరిస్తున్న ఏఎంఆర్ సంస్థకు కాంట్రాక్ట్ గడువు ముగియడంతో మార్చి 17 నుంచి మైనింగ్ ఈ–పర్మిట్ వెబ్‌సైట్‌ను నిలిపివేశారు. దీంతో క్వారీలు, క్రషర్ యూనిట్ల నుంచి రవాణా కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనింగ్ విధానంలో మార్పుల పేరుతో టెక్కలి మైనింగ్ కార్యాలయం పరిధిలో తొలుత సుమారు 4 నెలల పాటు క్వారీ నిర్వాహణ పనులు ఆపివేశారు. గత ప్రభుత్వంలో విశ్వ సముద్ర సంస్థ మైనింగ్ ఏజన్సీగా వ్యవహరించగా వారిని తప్పిస్తూ ఏఎంఆర్ సంస్థకు ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు గడువు ముగియడంతో కార్యకలాపాలను అధికారికంగా నిలిపేశారు.



టెక్కలి మండలంలో ఎలాంటి మైనింగ్ ప్లానింగ్‌లు లేకుండా ఇష్టారాజ్యంగా నడుస్తున్న అధికార పార్టీకి చెందిన ఓ కార్యకర్త క్రషర్



- అస్తవ్యస్తంగా మైనింగ్ రంగం
- ముఖ్యనేత సోదరుడి కనుసన్నల్లో అక్రమ దందా
- అధికార పార్టీకి చెందిన క్వారీలు, క్రషర్లకే గ్రీన్ సిగ్నల్
- మిగతా వాటికి అడ్డంకులు
- తాజాగా ఏజెన్సీ గడువు ముగిసినా ఆగని కార్యకలాపాలు
- ఈ–పర్మిట్ వెబ్‌సైట్ నిలిచిపోయినా కొనసాగుతున్న రవాణా



అనధికారికంగా కార్యకలాపాలు

ఈ–పర్మిట్ వెబ్‌సైట్ నిలిచిపోయినప్పటికీ కొన్ని క్రషర్ల నుంచి విచ్చలవిడిగా మెటీరియల్ రవాణా జరుగుతుండడం, మరి కొన్ని క్వారీల నుంచి బ్లాకులు తరలిపోతున్నాయి. పర్మిట్లతో సంబంధం లేకుండా రవాణా చేసేస్తున్నారు. 20 ఎంఎం చిప్స్ ట్రాక్టర్ లోడ్‌ను అడ్డగోలుగా రూ.5 వేలకు అమ్మకాలు చేస్తున్నారు. టెక్కలి మైనింగ్ కార్యాలయం పరిధిలో క్రషర్లు, క్వారీల నిర్వాహణ విషయంలో అధికారులు అధికార పార్టీ నేతలకు అనుకూలంగా పక్షపాత వైఖరి అనుసరిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న క్రషర్లు, క్వారీలపై మైనింగ్ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే తప్ప అసలు నిజాలు బయటపడవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్కసుతో కక్షసాధింపు..

వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే అక్కసుతో కొన్ని క్రషర్లతో పాటు టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ గతంలో ఓ వ్యాపారికి లీజుకిచ్చిన క్రషర్‌పై సైతం కక్ష సాధింపులకు పాల్పడ్డారు.

అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు



టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడి డైరెక్షన్‌లో మైనింగ్ అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు చెందిన క్రషర్లు, క్వారీలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా కనీసం పట్టించుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో కొంత మందిపై అడ్డగోలుగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ–పర్మిట్ వెబ్‌సైట్ ఆగిపోతే క్రషర్లు, గ్రానైట్ బ్లాకుల రవాణా ఎలా జరుగుతున్నాయి. మైనింగ్ అధికారుల అడ్డగోలు వ్యవహారంపై అన్ని రకాల ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. ఆయా ఆధారాలతో కోర్టులను ఆశ్రయించి అధికారులు చేస్తున్న తప్పులకు మూల్యం చెల్లించుకునే విధంగా చేస్తాం.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టెక్కలి

అయితే అధికార పార్టీకి చెందిన నేతలు నిర్వహిస్తున్న కోటబొమ్మాళి, టెక్కలి మండలాల్లో కొన్ని క్రషర్లకు మెటల్ క్వారీలు లేకపోయినా.. ఆయా క్రషర్లలో ఇష్టారాజ్యంగా మెటీరియల్ తరలిపోతున్నప్పటికీ మైనింగ్ అధికారులు మాత్రం అటు వైపుగా కన్నెత్తి చూడడం లేదు. ప్రస్తుతం ఈ–పర్మిట్ వెబ్‌సైట్ ఆగిపోయినప్పటికీ అధికార పార్టీ నేతలకు చెందిన క్రషర్లలో మాత్రం మెటీరియల్ రవాణా ఆగడం లేదు. మరో వైపు కూటమి పార్టీలో ఒకటైన జనసేనకు చెందిన నియోజకవర్గం నాయకుడు ఓ క్రషర్‌ను లీజుకు తీసుకున్నారు. అయితే దానికి పూర్తి స్థాయిలో మైనింగ్ ప్లానింగ్ ప్రకారం అనుమతులు తీసుకోకపోయినప్పటికీ నిర్వాహణ మాత్రం వారికి ఇష్టమొచ్చినట్లుగా కొనసాగిస్తున్నారు. ముఖ్య నేతతో పాటు ఆయన సోదరుడు చేస్తున్న కక్ష సాధింపు చర్యలకు మైనింగ్ అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు అధికార పార్టీ నేతలకు చెందిన క్రషర్లలో ఇష్టారాజ్యంగా మెటీరియల్ వెలికి తీస్తున్న పట్టించుకోకపోవడంపై అధికారుల వైఖరిపై ఆయా వర్గాల్లో పెద్ద చర్చ కొనసాగుతోంది.



కాంట్రాక్ట్ గడువు ముగిసిన ఏఎంఆర్ సంస్థ కార్యాలయం

ఆకట్టుకున్న రంజాన్ కవి సమ్మేళనం



రంజాన్ కవి సమ్మేళనంలో కవుల కవితాగానం

శ్రీకాకుళం కల్చరల్: రంజాన్ సందర్భంగా స్థానిక కేంద్ర గ్రంథాలయంలో రాష్ట్ర ముస్లిం రచయితల వేదిక వ్యవస్థాపకులు కరీముల్లా ఆదేశాల మేరకు సోమవారం జరిగిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహ్మద్ రఫీ అధ్యక్షతన 'హిందూ ముస్లిం భాయిభాయి' పై జరిగిన ఈ కవి సమ్మేళనంలో పలువురు కవులు రంజాన్ విశిష్టతను, గొప్పదనాన్ని తెలియజేస్తూ చక్కనైన కవితలను చదివారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక ఈ కవి సమ్మేళనం అని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సురంగి మోహనరావు చేతుల మీదుగా ఈవేమన కవితా నిలయం తరఫున విశేష వైద్య సేవలు అందిస్తున్న పి.బి.డేవిడ్‌ను ఆరోగ్యమిత్ర బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో కవులు గుడిమెట్ల గోపాలకృష్ణ, వాడాడ శ్రీనివాస్, పసుపురెడ్డి శ్రీను, బోగెల ఉమామహేశ్వరరావు, గుణస్వామి, తంగి ఎర్రమ్మ, బి.సంతోష్ కుమార్, విజయలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

టైమ్ స్కేల్ అమలు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు ప్రభుత్వం మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని యూనిటీ వెల్ఫేర్ టీం జిల్లా ఉపాధ్యక్షుడు చిగిలిపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చిలకపాలెంలో సోమవారం సమగ్ర శిక్ష ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించి, ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా కనీసం వేతనం అందజేయటం లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. కనీసం మినిమం టైమ్ స్కేల్ అమలు చేస్తే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. పార్ట్ టైమ్ పేరుతో ఉద్యోగులను ఫుల్ టైమ్ వినియోగించుకుంటున్నారని, పార్ట్ టైమ్ పదం తొలగించాలని అన్నారు. ఒకేషనల్ టీచర్లుగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ భద్రత, కుటుంబ నిర్వహణకు తగ్గ వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ ప్రతినిధులు వై.సత్యనారాయణ, ఎల్.దిలీప్‌కుమార్, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దర్యాప్తు

జలుమూరు: యలమంచిలి ఎండల మల్లికార్జున దేవాలయంతోపాటు అక్కురాడ, కొండపోలవలస ఆంజనేయ ఆలయాల గోడలపై అన్య మత సూక్తులు రాసిన వారిని పట్టుకునేందుకు ఆరు బృందాలతో ముమ్మర దర్యాప్తు చేస్తున్నామని టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం యలమంచిలి, అక్కురాడ, కొండపోలవలస ఆయా దేవాలయాలను మరోసారి పరిశీలించి అర్చకులు, గ్రామస్తులతో మాట్లాడారు. అదే సమయంలో ఎక్కువ మందికి వచ్చిన ఫోన్ కాల్స్ సీడీఆర్‌ను పరిశీలిస్తున్నారు. అనంతరం జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఈ బృందాల అధికారులతో మాట్లాడారు. దుండగులను త్వరలో పట్టుకుంటామన్నారు.

నడిరోడ్డుపై నరకం



శ్రీకాకుళం నగరంలోని రైతుబజార్ జంక్షన్ వద్ద మండుటెండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్



- మండుటెండల్లో ట్రాఫిక్ పోలీసుల కష్టాలు
- ఉదయం 8 నుంచి రాత్రి పది వరకు షిఫ్టుల వారీగా విధులు
- నదుపాయాలు లేక ఇబ్బందులు

శ్రీకాకుళం క్రైమ్ : మండుతున్న ఎండల్లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు చెమటోట్లు కారుస్తున్నారు. వేసవి వచ్చిందంటే వారి వెన్నులో వణుకు పుడుతుంది. అను నిత్యం ట్రాఫిక్ విధుల్లో కష్టపడుతున్న రక్షక భటులకు ఎండల వేడిమి నుంచి ఉపశమనం పొందేలా కనీస వసతులు కల్పించడంలో మున్సిపాలిటీ, పోలీసు ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

షిఫ్టుల వారీగా.. విధుల్లో 60 మంది

జిల్లాకేంద్రంలో ఉన్న ఏకైక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 60 మంది వరకు 15 పాయింట్లలో విధులు నిర్వర్తిస్తారు. డేఅండ్‌నైట్, ఏడురోడ్లు, ఆర్టీసీకాంప్లెక్స్, అంబేద్కర్, సింధూర, ఏ–1 ఆస్పత్రి, రిమ్స్, రామలక్ష్మణ, ఇలిసిపురం–రైతుబజారు, పొట్టిశ్రీరాములు, పందుంప్పళ్ల, అరసవల్లి దేవాలయం, అరసవల్లి మిల్లు కూడళ్లలో రెగ్యులర్ విధుల్లో ఉంటారు. ఇవేకాక పీఎన్‌కాలనీ పాయింట్‌లో భారీ వాహనాలు నగరంలోకి ఎంటర్ అవ్వకుండా చూడటం, అఫీషియల్ కాలనీ సమీప ఉమెన్స్ కళాశాల రోడ్డులో బీట్లు నిర్వర్తిస్తుంటారు. సీఐ నాగరాజు పర్యవేక్షణలో ఐదుగురు ఎస్‌ఐలు డేఅండ్‌నైట్, ఆర్టీసీ, పీఎస్ఆర్, ఏడు రోడ్ల కూడలిలో నలుగురు, మధ్యాహ్న వేళల్లో ఒకరు ప్రతి పాయింట్ తనిఖీ చేస్తుంటారు. 14 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 35 మంది కానిస్టేబుళ్లు (వీరిలో ఇద్దరు మహిళా పీసీలు), 14 మంది హోంగార్డులు విధుల్లో ఉంటారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు షిఫ్టుల వారీగా వీరికి విధులు ఉంటాయి. వీరే కాక ద్విచక్రవాహనాలపై ట్రాఫిక్ కోల్ట్స్ నలుగురు షిఫ్టుల మాదిరిగానే తిరుగుతుంటారు.

వాహనదారులకు ఉపశమనం కలిగేలా..

గత ఏడాది ఎం.అవతారం ట్రాఫిక్ సీఐగా ఉన్నప్పుడు వాహనదారుల సౌకర్యార్థం మున్సిపాలిటీవారి చొరవతో ముఖ్య కూడళ్లలోని సిగ్నల్ పాయింట్ల వద్ద అన్ని దిక్కుల్లోనూ గ్రీన్ మ్యాటీ టెంట్లు వేయించారు. 60 సెకన్ల నుంచి 120 సెకన్ల వరకు పడే రెడ్ సిగ్నల్స్ బారి నుంచి వాహనదారులు ఈ మ్యాటీల వలన ఉపశమనం పొందారు. అయితే ఆ మ్యాటీల రాడ్లు పటిష్టంగా వేయకపోవడంతో వారం పది రోజుల్లోనే గట్టి గాలులకు ఎగిరిపోయాయి. మున్సి పాలిటీ వారు ముందస్తు పటిష్ట చర్యలు తీసుకుని అలాంటి ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



వేసవి కాలంలో ట్రాఫిక్ సిబ్బంది ఎండల్లో ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు దిశగా మున్సిపాలిటీ అధికారులను సమన్వయం చేసుకుని అన్ని రకాల ఏర్పాట్లు చేస్తాం. ఏసీ హెల్మెట్లు ఖర్చుతో కూడుకున్నవి. పై విషయాలన్నీ ఉన్నతాధికారులకు నివేదిస్తాం. దాతలు కూడా ఈ విషయంలో ముందుకొస్తే మంచిది. వాహనదారులు ఇబ్బంది పడకుండా చూసుకుంటాం.

– సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం





ఇలా చేస్తే ఉపశమనం..

- ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చాలా పట్టణాల్లో ట్రాఫిక్ పోలీసుల కోసం ప్రత్యేకంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.
- హైదరాబాద్‌లో ఎండల వేడిమి తట్టుకునేందుకు వీలుగా అక్కడి ట్రాఫిక్ పోలీసులకు రూ. 5 వేలు విలువ చేసే ఏసీ హెల్మెట్‌లు ఇచ్చారు. జిల్లాలోనూ అలాంటి ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.
- అలాగే సందర్భాను సారం రౌండ్ టైప్ హేట్‌లు, చలువ కళ్లద్దాలు, దుమ్ము ధూళి పడకుండా ఫేస్‌మాస్కులు పాయింట్ పరిసరాల్లో మంచినీటి(మినరల్ వాటర్) టిన్నులు కల్పిస్తే మంచిదని అంటున్నారు.
- ట్రాఫిక్ ఐలాన్లు వేడెక్కిపోతుండడంతో గడ్డి లేదా తాటాకు టెంట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

కబడ్డీ పోటీల విజేత సింగుపురం



షీల్డ్ అందుకుంటున్న విజేత జట్టు

పలాస: మండలంలోని చిన్నగురుదాసుపురంలో ఉగాది సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం సమీపంలోని సింగుపురం జట్టు విజేతగా నిలిచింది. చినగురుదాసుపురం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 21 జట్లు పాల్గొన్నాయి. లింబుగాం జట్టు ద్వితీయ, గొల్లమాకన్నపల్లి తృతీయ స్థానాలు సాధించాయి. శ్రీకాకుళం కె.ఆర్.స్టేడియం జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పాలిన కృష్ణారావు, కార్యదర్శి జినగ తాతారావు, సాలిన రమేష్, జినగ ధర్మారావు, కొండే తేజేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గమిదే

శ్రీకాకుళం: జిల్లా ఫ్యాప్టో చైర్మన్‌గా బి.శ్రీరామమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని రాష్ట్ర ఫ్యాప్టో పరిశీలకులు(యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి) ఎస్.కిషోర్ తెలిపారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఫ్యాప్టో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఫ్యాప్టో వైస్ చైర్మన్లుగా పి.హరిప్రసన్న, వి.సత్యనారాయణ, సెక్రటరీ జనరల్‌గా పి.ప్రతాప్‌కుమార్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎస్.వి.రమణమూర్తి, ఎం.మదన్‌మోహన్‌రావు, బి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కె.జగన్‌మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులుగా బాబూరావు, ఎస్.రమేష్‌బాబు, పి.కృష్ణారావు, వై.వాసుదేవరావు, జి.రమణ, ఎస్.వి.అనిల్‌కుమార్, బి.రవి, ఎస్.ఎస్.ఎల్.వి.పూర్ణిమలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న కన్వీనర్ కొత్తకోట శ్రీహరి

శ్రీకాకుళం అర్బన్: డీఎస్సీ–2003 అభ్యర్థులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డీఎస్సీ–2003 ఏపీ ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ఎన్జీవో కార్యాలయంలో సోమవారం ఫోరం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆలస్యం వల్లే డీఎస్సీ – 2003 నియామకాలు 2005 నవంబరులో చేపట్టారని చెప్పారు. దీంతో పాత పెన్షన్ విధానం కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 మేరకు అర్హత వ్యక్తులందరికీ పాతపెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. తూర్పుగోదావరికి చెందిన రూపరాజు మాట్లాడుతూ కోర్టును ఆశ్రయిస్తే న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జిల్లా కో–కన్వీనర్లు కె.ప్రకాష్, పి.శ్రీకర్, వి.శ్రీను, ఎ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో చూచిరాతలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడం అవసరమేనని.. అయితే డీఈఓ తిరుమల చైతన్య ఎంచుకున్న మార్గం సరైనదికాదని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ అన్నారు. కుప్పిలి మోడల్ స్కూల్ కేంద్రంలో అన్యాయంగా డీబారైన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. శ్రీకాకుళం నగరంలోని దాసరి క్రాంతిభవన్ వేదికగా సోమవారం ఎస్టీయూ జిల్లా మొదటి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పిలి కేంద్రంపై కాపీయింగ్ ఆరోపణలు ఉన్నప్పుడు పరీక్ష కేంద్రంగా ఎందుకు మంజూరు చేశారని ప్రశ్నించారు. పరీక్ష కేంద్రం నిర్వహణకు పకడ్బందీ చర్యలు ఎందుకు చేపట్టలేదో డీఈఓ తెలియజేయాలని, హోల్డ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సస్పెన్షన్లను వెంటనే ఎత్తివేయాలని, కోర్టు కేసులను రద్దు చేయాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి మాట్లాడుతూ డీఈఓను వెంటనే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. 400 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్న కేంద్రంలో విద్యార్థులను భయాందోళనలకు గురిచేసి, పిల్లల విలువైన కాలాన్ని వృథా చేసిన డీఈఓపై కచ్చితంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రమణ, ప్రతినిధులు పి.రామకృష్ణ, ఎస్.రాధాకృష్ణ, కె.శ్రీనివాసరావు, లక్ష్మణరావు, పి.రమణ, డీవీఎస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశపడితే.. అంతే సంగతులు!

- ప్రాణాలు తీస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్
- లోన్, ట్రేడింగ్ యాప్‌లతోనూ నష్టపోతున్న యువత
- అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్న వైనం



శ్రీకాకుళం క్రైమ్: యువతను అప్పుల ఊబిలోకి నెట్టి ఆపై ఒత్తిడితో బలవన్మరణాలకు కారణమవుతోన్న అతి ప్రమాదకర వ్యసనం ఆన్‌లైన్ బెట్టింగ్. దీనితో పాటు గేమ్‌లు, పేకాట, స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్‌లకు అలవాటు పడి క్రెడిట్‌కార్డులు, లోన్‌యాప్‌ల రూపేణా కొందరు, తెలిసిన వారి వద్ద మరికొందరు అప్పులపాలవుతున్నారు. ఇటీవల చిత్తూరులో ముగ్గురు యువకులు, విశాఖపట్నంలో మరో ముగ్గురు, మన జిల్లాకు చెందిన ఓ ఆర్మీ ఉద్యోగి కాశ్మీర్‌లో బలవన్మరణం.. వీటన్నింటి వెనుక బెట్టింగ్ యాప్‌లే ఉన్నట్లు సమాచారం. ఇందులో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివే నిరుద్యోగ యువతే కాదు.. రూ. వేలల్లో లక్షల్లో జీతాలు సంపాదించే ఆర్మీ, సీఐఎస్ఎఫ్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఒకరేమిటి అన్ని వర్గాల వారు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో అర్ధాయుష్షుతోనే లోకాన్ని వీడుతున్నారు. మన జిల్లానూ ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ జాఢ్యం పీడిస్తోంది. ఆత్మహత్యా మరణాల వెనుక కనిపించని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ భూతం ఉందన్నది బాధిత కుటుంబాలకే తెలిసిన విషయం. కొంత మంది యూట్యూబర్లు సమాజ సేవ ముసుగులో ఇప్పటికే యాప్‌లను ప్రమోట్ చేస్తుండటం, వారిని పోలీసులు ఇటీవల విచారణ చేపట్టడం కొంత ఊరటనిచ్చే విషయం.

డబ్బులు వచ్చినట్టే వచ్చి..

ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ వంటివి ప్రారంభంలో బాగా డబ్బులొస్తాయి. కూర్చున్న చోటకే సొమ్ములు రావడంతో యువత ఈజీగా ఆ ఉచ్చులో పడతారు. ఆ తర్వాత అసలు ఆట మొదలవుతుంది. కొద్దిపాటి లాభాలిస్తూ అధికంగా దోచుకునేలా ప్రోగ్రామింగ్ చేసి ఉండటంతో అవగాహన లేక డబ్బులు పోగొట్టుకుంటారు. పోయిన డబ్బులు రాబట్టుకోవాలనే ఉద్దేశంతో బెట్టింగ్‌లు చేస్తూనే అలా ఆ ఊబిలో కూరుకుపోతారు.

ఆ యాప్‌లు మరింత ప్రమాదం..

ఆన్‌లైన్‌లో నిమిషాల్లోనే అప్పులిస్తామంటూ వస్తున్న లోన్ యాప్స్ యువత పట్ల ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. లోన్ ఇచ్చినట్లే ఇచ్చి ఆ తర్వాత అధిక వడ్డీలు, పెనాల్టీల పేరిట అధికంగా వసూలు చేస్తుంటాయి. ఒకవేళ ఇవ్వకపోతే బలవంతంగా వసూళ్లు చేసే క్రమంలో తీవ్రంగా వేధిస్తారు. లోన్ ఇచ్చేముందే వినియోగదారుని ఫొటోలు, వీడియోలు, కాంటాక్ట్ నెంబర్లు వంటి వ్యక్తిగత వివరాలన్నీ సేకరించి వారికి అనేక రకాలుగా వేధించడమే కాకుండా ఆఖరికి న్యూడ్ వేధింపులు సైతం మొదలవుతాయి. చేసేది లేక ఆత్మహత్యలకు పాల్పడతారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

- బెట్టింగ్‌లకు సంబంధించి ఓ ప్రధాన ముఠాను వైజాగ్ కేంద్రంగా ఓ వ్యక్తి నడుపుతున్నాడు.. క్రికెట్, జూదం, పేకాట ఏదైనా అటు ఆన్‌లైన్‌లోనూ, ఇటు ఆఫ్‌లైన్‌లోనూ గేమింగ్ ఆడించడం ఈయనకే చెల్లు. ఎంతమంది అధికారులొచ్చి కఠినంగా వ్యవహరించినా చాపకింద నీరులా విస్తరించడం, యువతను శాఖలుగా విభజించి బలిపశువులుగా మార్చడం, షీటర్లతో సంబంధాలు నెరపడం ఈయన రెగ్యులర్‌గా చేస్తున్న పని.
- ఇప్పటికే ఓ యూట్యూబర్ పుణ్యమా అని రణస్థలం పరిధిలోని యువత తీవ్రస్థాయిలో అప్పుల ఊబిలోకి వెళ్లిపోతున్నారు. ఫాలోవర్లు ఎక్కువగా ఉండటంతో సామాజిక సేవ ముసుగులో ఆ యూట్యూబర్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడమే కాక వాటికి సంబంధించిన లింక్‌లను క్లిక్ చేయాలంటూ సందేశాలిస్తున్నాడు. ఇలా చేయడం వల్ల వీరికి బుకీలనుంచి, సంబంధిత యాప్ నిర్వాహకుల నుంచి డబ్బులు ముడుతుంటాయి. కానీ ఇతను పంపిన వీడియోలకు యువత ఆకర్షితులై ఒక్కొక్కరు రూ.500 నుంచి రూ.2000 వరకు ఆన్‌లైన్ బెట్టింగ్ కాసి మోసపోతున్నారు. మరి కొందరైతే ఎదురుతిరిగి అదే యూట్యూబ్‌లో ఇతగాడు చేస్తున్న అన్యాయాలను ఏకిపారేస్తున్నారు. ఇదే యూట్యూబర్‌ను ఇక్కడి పోలీసులు ప్రతీ అంశంలోనూ ప్రాధాన్యతనిస్తూ కనిపించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.
- రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల యువత 40 మంది వరకు రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు ఒక్కొక్కరూ మోసపోవడం గమనార్హం. వీరిలో రూ.5 లక్షలకు మించి ఇద్దరు ముగ్గురున్నారు. కొన్నిచోట్ల అప్పుల వారు ఇళ్లమీదకు దండెత్తిరావడం కూడా జరిగింది.
- కాశీబుగ్గ కేంద్రంగా ఓ యువకుడు రూ.8 లక్షలు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో కాసి తీవ్రంగా నష్టపోయాడు. కుటుంబ పరిస్థితి అంతంత మాత్రం కావడంతో ఇప్పుడు వారి పరిస్థితి వర్ణనాతీతం.
- వజ్రపుకొత్తూరు మండలం అమలపాడుకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకున్నాడు. కాశ్మీర్‌లో సర్వీస్ వెపన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూండి ఉద్దాన ప్రజలు ఈ ఘటనతో ఉలిక్కిపడ్డారు.
- ఐపీఎల్, ఐసీసీ ఈవెంట్ల సమయంలో క్రికెట్ చూసే యువత రూ.వేలల్లో బెట్టింగ్‌లు కాస్తూ అప్పులపాలవుతున్నారు. ఆ వ్యసనంతో సాధారణ రోజుల్లో సైతం ఆన్‌లైన్ క్రికెట్ గేమింగ్ యాప్‌ల్లో ఒక్కొక్కరు రూ.50 వేలు నుంచి రూ.10 లక్షల వరకు పెట్టి నష్టపోతున్నారు. ఇలా రూ. 80 లక్షల వరకు నష్టపోయిన బాధిత యువత ఉన్నారు. బుకీలు నేరుగా వాళ్ల వద్దకు వెళ్లకపోయినా థర్డ్‌పార్టీ వ్యక్తి వచ్చి బెదిరింపులకు పాల్పడటం, దాంతో యువత వారి ఇళ్లల్లోనే చోరీలకు పాల్పడటం, పోలీసు కేసు అయ్యాక తమ బిడ్డలే చేశారని తెలుసుకుని తాహతు ఉన్నవాళ్లు తీర్చడం చేస్తున్నారు.

సమాచారమివ్వాలి..



బెట్టింగ్‌పై ఎటువంటి సమాచారమున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఇలాంటి వ్యసనాలను ఆదిలోనే తుంచాలంటే తల్లిదండ్రులు పిల్లలను, భార్యలు భర్తలను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. వాస్తవానికి ఆన్‌లైన్‌బెట్టింగ్ యాప్‌ల్లో సంపాదించింది ఎవరూ ఉండరు.. అందరూ పోగొట్టుకున్నవారే. యువత దీనిని గ్రహించాలి.

– సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి..



యువ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మంచి ఉద్యోగాల్లో ఉన్నవారు సైతం అత్యాశతో ఇటువంటి బెట్టింగ్‌యాప్‌ల జోలికి వెళ్లి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. పోలీసులు కూడా దృష్టి సారిస్తే మంచిది.

– గురుగుబెల్లి దామోదరరావు, బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ బడిని కాపాడుకోవడం ద్వారా సమాజంలో అందరికీ విద్య అందుతుందని, నైతిక విలువలు, రాజ్యాంగ విలువలు పరిరక్షించబడతాయని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశం సోమవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న విద్యారంగ సంస్కరణలు సక్రమంగా లేవన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాల పేరుతో మిగిలిన ప్రాథమిక పాఠశాలలో ఉన్న మూడు, నాలుగు, ఐదు తరగతి విద్యార్థులను మ్యాపింగ్ చేయడం వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంగా ప్లస్–2 పాఠశాలలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించకపోతే తల్లిదండ్రులతో కలిసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి సామాజిక ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిషోర్‌కుమార్, ఎస్.మురళీమోహన్, వి.లక్ష్మీ, ఉత్తరాంధ్రల జిల్లా పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన కె.విజయగౌరి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● స్వర్ణ కిరీట వైభవం



జిల్లా కేంద్రంలోని పెద్దబరాటం వీధిలో కొలువైన గ్రామదేవత నీలమ్మతల్లికి సోమవారం బంగారు కిరీటం, మకర తోరణం అలంకరించారు. భక్తుల సహకారంతో ఈ ఆభరణాలను తయారు చేయించి అలంకరించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బరాటం సాయిరాజ్ తెలిపారు.

- శ్రీకాకుళం కల్చరల్

తెలుగు తమ్ముళ్ల పిక్కాట!



జట్టు కళాశీ సంఘ భవనం వద్ద హనుమాన్ నగర్‌కు వెళ్లే దారిలో జరుగుతున్న పిక్కాట

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో తెలుగు తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమకు ఏది తోస్తే అదే న్యాయమని భావిస్తూ చెలరేగిపోతున్నారు. ఇప్పటికే ఐపీఎల్ బెట్టింగ్ కారణంగా యువత బలి అవుతుండగా తాజాగా నరసన్నపేటలో నడిరోడ్డుపై పిక్కాట(లాటరీ) ఆడిస్తున్నారు. స్థానిక జట్టు కళాశీ సంఘం శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తోంది. దీంట్లో భాగంగా తెలుగు తమ్ముళ్లే దగ్గరుండి లాటరీ ఆడిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నవమి ఉత్సవాలకు లాటరీ నిర్వాహకులు పెద్ద మొత్తంలో తెలుగు తమ్ముళ్లకు ముట్ట చెప్పినట్లు తెలుస్తోంది. దీనిని జనాల నుంచి రాబట్టడానికి మోసపూరితమైన లాటరీ ఆట నిర్వహిస్తున్నారు. ఆరు నెలలుగా మండలంలో ఎక్కడా లాటరీలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టంగా చర్యలు తీసుకున్నారు. తాజాగా తెలుగు తమ్ముళ్లు పోలీసులపై ఒత్తిడి చేసి వేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చాలామంది యువత వ్యసనాల బారిన పడుతున్నారని, ఇప్పుడు బహిరంగంగా లాటరీలు పెడితే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, జట్టు కళాశీ సంఘం భవనం పక్కనే పబ్లిక్‌గా లాటరీ నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై సీఐ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రబీలో ధాన్యం కొనుగోలు జరిగేనా?



జగ్గయ్యపేట సమీపంలో రోడ్డు పక్కనున్న ధాన్యం బస్తాలు

సారవకోట: ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు సేకరణ లక్ష్యం పూర్తయిందనే నెపంతో చాలాచోట్ల ధాన్యం కొనుగోలు పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ నేపథ్యంలో రబీలోనైనా ధాన్యం కొనుగోలు జరిగేనా అంటూ రైతులు ఎదురుచూస్తున్నారు. సారవకోట మండలంలోని కొత్తూరు, గోపాలపురం, అగదల, బురుజువాడ, అక్కివలస, బద్రి, లక్ష్మీపురం, సారవకోట, జగ్గయ్యపేట తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలలో వరి సాగు చేశారు. ప్రస్తుతం యంత్రాలతో నూర్పులు చేపట్టి ధాన్యం ఆరబెడుతున్నారు. కనీసం రబీలోనైనా తాము పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే చాలామంది రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలుపై నమ్మకం లేక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ గ్రామాల నుంచి ప్రతిరోజు లారీలతో ధాన్యం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి.



సారవకోట సమీపంలో రోడ్డు పక్కనే ఆరబెట్టిన ధాన్యం

ఆలయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జలుమూరు మండలం యలమంచిలి ఎండల కామేశ్వరస్వామి ఆలయ గోడలపై అన్యమత రాతలు వంటి ఘటనలతో పాటు ఆలయాల్లో చోరీలు జరగకుండా నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు అన్నారు. సోమవారం శ్రీకాకుళం రూరల్ పరిధిలోని ఆలయాల కమిటీ సభ్యులతో ఎస్ఐ ఎం.హరికృష్ణ సమావేశం నిర్వహించారు. ఆలయాలకు నలువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఆలయానికి కమిటీలుండాలని, అందులో యువకులుంటే ఇద్దరు రాత్రిపూట ఆలయం వద్దే నిద్రపోయేలా చూడాలని, లేదంటే సెక్యూరిటీ గార్డులను పెట్టుకోవాలని ఎస్ఐ సూచించారు.

ఘనంగా కురిగాం పీహెచ్‌సీ వార్షికోత్సవం



వార్షికోత్సవ సభలో పాల్గొన్న పూర్వ, ప్రస్తుత వైద్యాధికారులు

కొత్తూరు : ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బందితో పాటు పలువురి సహకారంతో కురిగాం పీహెచ్‌సీ పరిధిలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని పూర్వ వైద్యాధికారులు, జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి పి.ప్రకాశరావు, హనుమంతు రమేష్, జంపు కృష్ణమోహన్, తిరుపతిరావు రెడ్డి, నరేష్‌కుమార్, సందీప్, దిలీప్, శ్రీలత చెప్పారు. కురిగాం పీహెచ్‌సీ ఏర్పాటై 20 ఏళ్లు పూర్తి కావడంతో వైద్యాధికారి పి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో వార్షికోత్సవం నిర్వహించడం రాష్ట్రంలో ఇదే మొదటిసారని చెప్పారు. భౌగోళికంగా ఒడిశాకు ఆనుకుని గ్రామీణ ప్రాంతంలో ఉన్న కురిగాం పీహెచ్‌సీలో వైద్యం అందించడం కష్టసాధ్యమైనప్పటికీ జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందుతున్నాయని, ఈ విషయంలో కురిగాం పీహెచ్‌సీ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. వైస్ ఎంపీపీ తులసీ వరప్రసాదరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రోగులకు నాణ్యమైన వైద్యం అందివ్వడం హర్షనీయమన్నారు. వైద్యాధికారులకు ఎల్లప్పుడూ మావంతు సహకారం ఉంటుందని చెప్పారు. అనంతరం పూర్వ వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సేపాన అశోక్‌కుమార్, ఈవో బుజ్జిబాబు, సూపర్‌వైజర్ తిరుపతిరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మండుటెండలో ఉపశమనం



కర్బూజా ముక్కలు అమ్ముతున్న వ్యాపారి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎండల ధాటికి జనం విలవిల్లాడిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు డీహైడ్రేషన్‌కు గురై శరీరంలో నీటిశాతం కోల్పోయి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎండదెబ్బ నుంచి ఉపశమనం పొందేందుకు కర్బూజా పండ్లు తినేందుకు జనం ఎగబడుతున్నారు. రోడ్లపై ఎక్కడికక్కడ తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి కిలో రూ.20, రూ.25, రూ.30 చొప్పున అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక్కో ముక్కను రూ.10కి అమ్ముతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



నుజ్జయిన కారు

ఎచ్చెర్ల: లావేరు మండలం రావివలస సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పిన్నింటి రాము, మరో వ్యక్తి సుభద్రాపురం నుంచి విశాఖ వైపు కారులో వెళ్తుండగా హైవే పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరికీ కాళ్లు విరగడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

అన్ని కులాలకు న్యాయం జరగాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాల, మాదిగ, రెల్లి, వాటి ఉపకులాలు అన్నింటికి న్యాయం జరగాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకులు పోతల దుర్గారావు కోరారు. శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ విజ్ఞానభవన్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ విషయంలో అన్ని కులాలకు న్యాయం జరగాలని, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. మాల, మాదిగ, రెల్లి, రెల్లి ఉపకులాలు అన్ని కలిసి మెలిసి ఉన్నాయని, ఎస్సీలకు మొత్తం మీద రిజర్వేషన్ పెంచాల్సి ఉండగా, విభజించి పాలించు విధంగా చేయడం సరికాదని, సమగ్రంగా రిజర్వేషన్ ప్రక్రియ జరగాలని, రిటైర్డ్ న్యాయమూర్తులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల నాయకుల సమక్షంలో కులాల వారీగా రిజర్వేషన్ శాతం ప్రకటించాలని కోరారు. సమావేశంలో పలు సంఘాల నాయకులు దండాసి రాంబాబు, అంపోలు ప్రతాప్, రామప్పడు, గంజి ఎజ్రా, రాము, అప్పన్న, రమేశ్‌బాబు, బోనేల రమేష్, రమణ, రవికుమార్, రామారావు, తవిటయ్య, పాపారావు, గౌరీ, తవిటిరావు తదితరులు పాల్గొన్నారు.

బుడితిలో బంగారం చోరీ

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో మూడు తులాల బంగారం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడితి గ్రామానికి చెందిన శిమ్మ రామారావు దంపతులు ఆదివారం హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి పనిమనిషి నాగమ్మ అటువైపుగా వెళ్లగా తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించింది. వెంటనే ఇంటి యజమానికి ఫోన్‌లో సమాచారం అందించింది. వారు నరసన్నపేటలో నివాసం ఉంటున్న రామారావు అల్లుడైన గిరీష్‌కుమార్‌కు సమాచారం ఇవ్వగా ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు తులాల చైన్, అర తులం బరువైన రెండు ఉంగరాలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. ఎస్ఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ గ్రామంలో ఎనిమిది నెలల వ్యవధిలో నాలుగు దొంగతనాలు జరగడం గమనార్హం.